


# సమస్యలు - పరిష్కారాలు

## - డా.యండమూరి వీరేంద్రనాథ్



సమస్య రాగానే మనం పరిష్కారం ఆలోచించటం మానేసి, విచారించటం ప్రారంభిస్తాం.

సముద్రం ఎంత పెద్దదైనా, నీళ్ళని లోపలికి రానివ్వకపోతే పడవ మునగదు. సమస్య ఎంత పెద్దదైనా, మనసులోకి రానివ్వకపోతే బాధ ఉండదు.

పాతికశాతం సమస్యలు పరిష్కారం లేనివి. పరిష్కారం లేని ఈ పాతిక శాతం గురించీ మనం జీవితంలో సగభాగం ఆలోచిస్తూ గడిపేస్తాం. ఇంకో యాభై శాతం సమస్యలు మనకి ఇతరుల వల్ల వచ్చేవి. అవి తీరాలంటే మారవలసింది వాళ్ళు. మనం కాదు. తాగుబోతు భర్త, దుబారా భార్య, గయ్యాళి అత్తగారు, చెడుదార్లో సంతానం వగైరా. వాళ్ళని మార్చటం ఎలా అని నిరర్థకంగా విచారిస్తూ మరో పాతిక శాతం కాలం గడిపేస్తాం. మిగిలిన పాతిక శాతం సమస్యల్నుంచి బయటపడాలంటే కఠినమైన నిర్ణయాలు అమలు జరపాలి. దురదృష్టవశాత్తూ ఇటువంటి సందర్భాల్లో మనం ఆలోచిస్తూ కూర్చుంటాము తప్ప నిర్ణయాలు తీసుకోము. తీసుకున్నా, అమలు జరపం.

...

ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో, ఆ నిర్ణయాన్ని ఎలా అమలు జరపాలో, ఏ సమస్యకి ఎలాంటి నిర్ణయం తీసుకుంటే సమస్య తాలూకు సాంద్రత తగ్గుతుందో ఆత్మీయంగా చెప్పే పుస్తకం.

బొమ్మలు: డా. జయదేవ్

## ముందు మాట

**ఈ** పుస్తకంలోని చాలా ప్రశ్నలు నవ్య, సాక్షి మొదలైన పత్రికలలో ప్రచురింపబడినవి. కొన్ని ప్రశ్నలు, సభల్లో ఉపన్యాసం అనంతరం శ్రోతలు అడిగినవి, మరి కొన్ని మిత్రుల మధ్య జరిగిన సంభాషణలో దొర్లినవి. కేవలం రెండు ప్రశ్నలు మాత్రం సమాధానం ఇవ్వటం కోసం సృష్టింపబడినవి.

కొన్ని సమాధానాల్లో కొన్ని కొటేషన్లు, చిన్న చిన్న కథలు, సంఘటనలు, సందర్భాలబట్టి గతంలో వ్రాసిన పుస్తకాల నుంచి పునరుద్ధాటించబడినవి. వీలైనంత ఎక్కువ మంది పాఠకులకు విషయం చేరాలనే ఉదేశంతో వాటిల్ని తిరిగి ప్రస్తావించడం జరిగింది. వీటిని అంతకు ముందే చదివిన పాఠకులకు ఈ పునరుక్తి విషయమై క్షమాపణలు. ఇక్కడ, సమాధానాల కన్నా... ప్రశ్నలు ముఖ్యమని ఉద్దేశ్యం. ప్రస్తుతం యువత ఎలాంటి సమస్యలతో బాధపడుతోందన్న విషయం తెలియజెప్పటంకోసం, జవాబుల్ని పునరుక్తీకరించటం జరిగింది. అదే విధంగా, కాపీ రైట్ లేని ఇంటర్నెట్ బొమ్మలు కొన్ని వాడుకోవటం జరిగింది. ఆ అజ్ఞాత కళాకారులకి కృతజ్ఞతలు.

చివరిగా ఒక మాట.

ఈ ప్రపంచంలో ఏ ఇద్దరి అభిప్రాయాలూ ఒకలా ఉండవు. ఇందులోని కొన్ని అభిప్రాయాలు కొంతమందికి నచ్చకపోవచ్చు. మరి కొందరికి కడుపులో దేవినట్టుగా కూడా అనిపించవచ్చు. ముందే చెప్పినట్టు ఎవరి అభిప్రాయాలు వారివి. దీనికోసం వాదనలు, ప్రతివాదనలు అనవసరం. వాదించేటప్పుడు మనం అవతలి వారిని అర్థం చేసుకోవటానికి వినం. మనం గెలవటానికి వీలుగా జవాబు ప్రిపేర్ చేసుకుంటూ వింటాం. ఇద్దరు రెచ్చిపోయి దీర్ఘంగా వాదించుకుంటున్నారంటే, అందులో ఒకరు మూగ, మరొకరు చెవిటి.

మూగ వాడికి అందరూ చెవిటి వాళ్ళలాగా కనబడతారు. చెవిటి వాడికి ప్రపంచమంతా మూగగా ఉన్నట్టు అనిపిస్తుంది. అర్థం – పర్థం లేని వాదనల పరమార్థం ఇదే.

వాదనలో గెలవటానికి అత్యుత్తమ సాధనం చిరునవ్వు. ఇతరులతో వచ్చే చాలా సమస్యల్ని 'నవ్వు' పరిష్కరిస్తుంది. 'మౌనం' సమస్యల్ని రాకుండా చేస్తుంది.

–రచయిత.

# తర్కం – తర్కరాహిత్యం

రజనీ ప్రభ, రంగరాజపురం.

మీరు తరుచు తర్కం-తర్కరాహిత్యం అన్న మాటలు వాడుతూ ఉంటారు. తేడా కాస్త వివరించండి.

కష్టమే. సత్యాలు వేరు, అభిప్రాయాలు వేరు. అభిప్రాయాలు మళ్ళీ రెండు రకాలు. ఒప్పుకునే అభిప్రాయాలు, విభేదించే అభిప్రాయాలు. కొందరికి తార్కికంగా కనపడినది మరికొందరికి కనపడదు. నలభై క్రితం జరిగిన ఈ సంఘటన నాకు ఇప్పటికీ గుర్తు. ఆడిటింగ్ పనిమీద నలుగురం చార్టెడ్ అకౌంటెంట్స్ బ్యాంకాక్ వెళ్ళాం. అప్పుడు నేను చిన్నవాణ్ణి. మాలో ఒకరు తనకి తెలిసినవారింట్లో సాయిబాబా భజనకీ, మరో స్నేహితుడు మసాజ్ పార్లర్‌కీ వెళ్ళారు. ఈ విషయం మా పై అధికారి (ఆడిటర్)కి తెలిసినా, తేలిగ్గా నవ్వేస్తూ 'ఎవరికి ఎందులో ఆనందం దొరికితే దానికి వెళ్ళారు. మొత్తానికి అందరూ ఎంజాయ్ చేశారు కదా' అన్నాడు. ఆయన చాలా క్యాజువల్‌గానే ఈ మాట అన్నా ఆ రోజుల్లోనే అది నా మీద ప్రభావం చూపించింది. తరచి చూస్తే అందులో మంచి ఫిలాసఫీ కనబడింది.

కానీ ఎక్కడ బాధ అనిపిస్తుందంటే తోటకూరకాడల్లా వేలాడే చంటిపిల్లల్ని ఎత్తుకుని అడుక్కునే బిచ్చగత్తెలకి కార్ల కిటికీల్లోంచీ, స్కూటర్లు ఆపీ డబ్బులిచ్చేవారిని చూసి..! వాళ్ళు ఆ పిల్లల్ని అద్దెకి తీసుకొస్తారనీ, నిద్రలోంచి లేవకుండా నల్లమందు పెడతారనీ, నార్కోటిక్ ఇంజెక్షన్లు ఇస్తారనీ, క్రమక్రమంగా ఆ పిల్లలు బలహీనమై ఎందుకూ పనికిరాకుండా పోతారనీ, అభం శుభం తెలియని పసికందుని ఎండలో రాక్షసంగా పడుకోబెట్టే హీనమైన వ్యాపారానికి తాము కూడా తోడ్పడుతున్నామని ఈ చదువుకున్న మూర్ఖులకి తెలియదా?

హోమంలో బిందెల కొద్దీ నెయ్యి పోసి యజ్ఞం చేసేవారినీ, విగ్రహాల్ని కడవల కొద్దీ పాలతో అభిషేకం చేసే వారినీ "కొంచం మంచిపని కోసం దాన్ని ఉపయోగించవచ్చు కదా. లక్షల కొద్దీ అన్నార్తులున్న దేశంలో ఇంత ఎందుకు వేస్ట్ చేస్తున్నారు" అని అడిగితే, "ఇదే ప్రశ్న... కోట్ల కొద్దీ దాహార్తులున్న దేశంలో లిక్కర్ మీద ఎందుకు వేస్ట్ చేస్తున్నారని మందు బాబుల్ని అడుగు" అంటారు. వారిని అడుగుతే, "మా డబ్బు, మా ఆనందం కోసం ఖర్చు పెట్టుకుంటున్నాం. నిన్ను అడగటం లేదు కదా" అంటారు. 'మా డబ్బు మా ఆనందం' అని వాదించేవారికి ఈ క్రింది ఉదాహరణ ఒక కనువిప్పు.

పద్దెనిమిదేళ్ళ కుర్రాడు ఒక కుర్రనటి ఫొటోలు పడకగదంతా నింపేశాడు. ఆమె సినిమాల కోసం, ప్రత్యక్ష దర్శనం కోసం డబ్బంతా ఖర్చు పెడుతున్నాడు. "అదంతా మేకప్పు. ఆమె కోసం అంత ధనము, సమయమూ ఖర్చు పెట్టవద్దు నాయినా" అన్నాడు తండ్రి. "నాకు దానివల్ల అమితమైన సంతోషం వస్తోంది. నా పాకెట్ మనీలోంచే ఖర్చు పెట్టుకుంటున్నాను. నష్టం ఏమీ లేదు కదా" అని సమాధానం ఇచ్చాడు కుర్రవాడు. "దీన్ని ఇంకా మంచిపనికి వినియోగించవచ్చుకదా" అన్న సలహాకి, "ఏది మంచి పనో చెప్పటానికి నువ్వెవరు? " అన్నాడు కొడుకు. 'చెప్పటం ధర్మం' అని తండ్రి ఉద్దేశ్యం. 'వినటం/వినకపోవటం నా ఇష్టం' అని కొడుకు ఉద్దేశ్యం. ఆస్తిక నాస్తిక వాదనలకి కూడా ఈ సిద్ధంతమే వర్తిస్తుంది.

## మేనరికం

బి. నవీన్, మెయిల్,

నా మరదలంటే నాకు పిచ్చి ప్రేమ. కానీ మేనరికం చేసుకుంటే పిల్లలు సరిగ్గా పుట్టరని మావాళ్లు పెళ్లికి ఒప్పుకోవడం లేదు. నా మరదలు లేకుండా నేను జీవించలేను. తనను నాకు దూరం చేయడం న్యాయమా? నేనిప్పుడు ఏం చేయాలి?

మేనరికం చేసుకుంటే అవలక్షణమైన సంతానం కలుగుతుందని నాతో సహా చాలా మంది నమ్ముతారు. ఇటీవలి కాలంలో OHIO స్టేట్ యూనివర్సిటీ వాళ్ళు, వందేళ్ళ క్రితం మేనరికం/రక్త సంబంధం చేసుకున్న దంపతుల తాలుకు ఇరవై అయిదు కుటుంబాల నాలుగు తరాలకు సంబంధించిన వివరాలు కొన్ని సేకరించారు. అందులోని 176 కుటుంబ సభ్యుల్లో 4 మంది దంపతులకి సంతానం లేదు. 8 మంది అంగవైకల్యంతో ఉన్నారు. 21 మంది పిల్లలు పదేళ్ళ లోపే మరణించారని తేలింది.

జీవ పరిణామ సిద్ధాంతాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన చార్లెస్ డార్విన్ మేనరికమే చేసుకున్నాడు. అతని అమ్మమ్మ, నాయనమ్మలవి కూడా మేనరికాలే. డార్విన్‌కి పదిమంది సంతానం. వారిలో ముగ్గురు పిల్లలు పదేళ్ళ లోపులోనే చనిపోయారు. మరి కొంతమంది పిల్లలకి సంతానం కలగలేదు. కొందరు మనవలు అంగవైకల్యంతో జన్మించారు (మరిన్ని వివరాల కోసం అతడి జీవిత చరిత్ర చదవండి). మేనరికంలో మొదటి తరం సంతానం బాగున్నా, రెండు మూడు తరాలకొచ్చేసరికి ఎక్కడో ఒకచోట దెబ్బ కొడుతుందని ఈ విధంగా పరిశోధకులు తేల్చారు. 'ముప్పై ఆరు రకాల బఠాణీల థియరీ' రూపొందించిన జన్యు శాస్త్రజ్ఞుడు మెండెల్ కూడా 'స్వపరాగ సంపర్కం వల్ల మొక్కలు బలహీనంగా పుడతాయి' అని నిర్ధారించాడు.

మీకు ప్రస్తుతం ఇరవై మూడు సంవత్సరాలు. ఆ వయసులో ప్రేమ 'పిచ్చి' గానే ఉంటుంది. ఇంకో రెండు సంవత్సరాలు ఆగితే మెచ్యూరిటీ పెరుగుతుంది. అప్పుడు పిచ్చి తగ్గి, నిజమైన ప్రేమ పెరుగుతుంది. మీ మూర్ఖత్వంతో అంగవైకల్యం గల పిల్లల్ని సృష్టించకండి. వారు మిమ్మల్ని ఎప్పటికీ క్షమించరు. అలాంటి పిల్లలు ఇంట్లో సంచరిస్తూ ఉంటే మీకూ, మీ మరదలికీ మనశ్శాంతి ఉండదు. 'లేదూ. ఇదంతా అనవసర భయం' అనుకుంటే మీ ఇష్టం.

ఆకాశ్, కూకట్ పల్లి:

నేనో సాఫ్ట్ వేర్ ఇంజినీర్ ని. నాకో మరదలు ఉంది. పెద్దగా చదువుకోలేదు. మావయ్య వాళ్లది పల్లెటూరు. పైగా సంప్రదాయాలకు ఎక్కువ విలువిచ్చే మనుషులు. ఆడపిల్లకు చదువెందుకు అని ఇంటర్ తో ఆపేశారు. అక్క కొడుకుని కాబట్టి తనని నాకివ్వాలని మావయ్య ఆలోచన. అమ్మ కూడా మావయ్యకు మా చిన్నప్పుడే మాటిచ్చిందట. దాంతో నాకు మా మరదలితో పెళ్లి చేయాలనుకుంటున్నారు. కానీ నాకది ఇష్టం లేదు. నేను చాలా మోడ్రన్ గా ఉంటాను. నా సర్కిల్ కూడా చాలా పెద్దది. పెద్దగా చదువుకోని పల్లెటూరి అమ్మాయిని చేసుకోవడానికి నా మనసు ఒప్పుకోవడం లేదు. మావాళ్ల ఆలోచనలు నాకు మొదటే తెలిసుంటే నో అనేసేవాడిని. కానీ ఈ మధ్యే అమ్మ నాతో చెప్పింది. కుదరదు అంటే కన్నీళ్లు పెట్టుకుంటోంది. ఈ మ్యాటర్ ఎలా డీల్ చేయాలి?

మీరు మోడ్రనా? మీ మరదలు పల్లెటూరి ట్రెడిషనలా? అన్నది పక్కన పెడితే, మేనరికం చేసుకోవటం ఆరోగ్యమైన పద్ధతి కాదు. మేనరికంలో మొదటి తరం సంతానం బాగున్నా రెండు మూడు తరాలకొచ్చేసరికి ఎక్కడో ఒకచోట దెబ్బ కొడుతుందని పరిశోధకులు తేల్చారు. దీని వల్ల మీ సంతానానికి ఎంత ప్రమాదమో ఆ తరువాతి వారసులకి కూడా అంతే ప్రమాదాన్ని మీరు కొనితెచ్చిన వారవుతారు

ఈ విషయం మీ పెద్దలకి వివరించండి. మేనరికం వల్ల వచ్చే నష్టాలు ఇదే శీర్షికలో చెప్పటం జరిగింది. ఇంకా వివరాలు కావాలంటే ఇంటర్‌నెట్‌లో "మెండెల్ థియరీ" వెతకండి. చాలా ఉదాహరణలు దొరుకుతాయి.

శ్రీవల్లి, నెల్లూరు:

మాదో మధ్య తరగతి ఉమ్మడి కుటుంబం. నేను ఇంట్లో చిన్న కోడలిని. అందుకనో ఏమో, అందరూ ప్రతి పనీ నాకే చెబుతారు. ఇద్దరు తోడి కోడళ్లు ఉన్నా అత్తగారు, మావగారు మంచినీళ్ల దగ్గర్నుంచి అన్నీ నన్నే అడుగుతారు. పోనీ అలా అని ప్రాముఖ్యతనిస్తారా అంటే అదీ లేదు. ఏదైనా ముఖ్యమైన విషయం మాట్లాడాలి అనుకున్నప్పుడు మాత్రం అత్తగారు పెద్ద కోడళ్లిద్దరితో చెప్తారు. నేనెంత సర్దుకుపోదామన్నా ఇలాంటివి నన్ను బాధపెడుతున్నాయి. పైగా పని చేసీ చేసీ విసుగు పుడుతోంది. 'నేనూ మీలాంటిదాన్నే కదా' అని అడిగేద్దామంటే తోటికోడళ్లు ఏమనుకుంటారోనని భయం. నాకు వాళ్లంటే ఇష్టమే. కానీ ఇంతగా అడ్జస్ట్ అవ్వాలంటే మాత్రం కష్టంగా ఉంది. నా బాధను వాళ్లకు చెప్పేదెలా?

జాయింట్ ఫ్యామిలీలో ఇవన్నీ మామూలే శ్రీవల్లిగారూ. మిగతా సీనియర్లందరూ కొత్త కోడలికే పని చెప్పటం, కొన్ని కుటుంబాల్లో సాధారణంగా జరుగుతూ ఉంటుంది. 'వీళ్ళందరికీ చేసి పెట్టలేక చస్తున్నాను' అని ఒక్కసారి కూడా అనుకోని గృహిణి ఒక్కరు కూడా ఉండరు. మీ ఈ సమస్య మీ భర్తతో చర్చించారో లేదో చెప్పలేదు. ముందు ఆ ప్రయత్నం చేయండి. కలిసి ఉండాలా, లేక విడిగా వెళ్ళిపోవటానికి ఆస్కారం ఉన్నదా ఆలోచించమనండి. అయితే ప్రతీ సమస్యకీ దూరంగా వెళ్ళిపోవటం పరిష్కారం కాదు. చిన్న చిన్న సమస్యలకి కూడా మీరు లోతుగా ఆలోచించి బాధపడుతున్నారేమో ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోండి. మీ వివాహం జరిగి ఎంత కాలం అయింది? మీకు సంతానం ఉన్నారా? ఒక వేళ లేకపోతే ఎలాగో మీరు తల్లి అవుతున్న కాలంలో కొంతకాలం పుట్టింట్లోనే ఉంటారు. ఆ తర్వాత పుట్టబోయే బిడ్డ సేవతో చాలా కాలం గడిచిపోతుంది. అప్పుడు ఆటోమేటిగ్గా ఇంట్లో వారందరూ మీకు దగ్గరవుతారు. వర్తమానంలో సమస్య, భవిష్యత్తులో అనుభవంగా మిగుల్తుంది. ఈ కోణంలో ఆలోచించి చూడండి.

బి.చంద్రశేఖర్, జడ్చెర్ల:

సాక్షాత్తూ భగవంతులైన శ్రీకృష్ణునికి, శివుడికి, వేంకటేశ్వర స్వామికి ఇద్దరు భార్యలు ఉన్నారు. కానీ నేను 'రెండో నెంబర్' మాట ఎత్తితే మాత్రం నా భార్య ఒప్పుకోవడం లేదు. పైగా విడాకులు ఇస్తానంటోంది. భగవంతునికి ఓ రూలు, భక్తుడికి ఓ రూలా?

ఈ శీర్షిక సమస్యల్లో ఉన్నవారి కోసం నిర్వహిస్తున్నది. మీరేదో సరదాగా ఈ ప్రశ్న అడిగినట్టుంది. అయినా చెప్తాను. కృష్ణుడికీ, శివుడికీ ఇద్దరు భార్యలు. కానీ ద్రౌపదికి ఐదుగురు భర్తలు. మీ భార్య కూడా ఈ విధంగా ఆలోచిస్తే మీరు ఏమవుతారు? ఉన్నాడో

లేదో తెలీని భగవంతుణ్ణి ఆదర్శంగా తీసుకోకుండా, ఒకవేళ తీసుకోవలసి వస్తే, ఇటువంటి విషయాల్లో భగీరథుడు, కర్ణుడు, ఏకలవ్యుడు లాంటి వారిని ప్రామాణికంగా తీసుకుంటే మంచిది.

## ఇరుగు-పొరుగు సమస్యలు – సలహాలు.

కృష్ణవేణి, రేణిగుంట:

నేనో గృహిణిని. మావారు ఆఫీసుకి, పిల్లలు స్కూలుకి వెళ్లిపోయిన తర్వాత ఇంట్లో ఖాళీగానే ఉంటాను. దాంతో ఊసుపోక అప్పుడప్పుడూ పక్కింటి వాళ్లతో కబుర్లు చెబుతుంటాను. ఈ మధ్యనే మా పక్కింట్లోకి కొత్తగా ఒక కుటుంబం వచ్చింది. ఆ ఇంటావిడే వచ్చి నన్ను పరిచయం చేసుకుంది. మంచిదానిలాగే ఉంది కదా అని స్నేహం చేశాను. కానీ ఆమె ధోరణి నాకు కాస్త ఇబ్బందిగా ఉంది. మా వ్యక్తిగత విషయాల్లో కూడా జోక్యం చేసుకుంటోంది. మాట తప్పించినా పదే పదే గుచ్చి అడుగుతుంటుంది. అలాగే వాళ్ల ఇంట్లో విషయాలూ నాకు చెబుతుంది. నాకు ఈ రెండూ ఇష్టం లేదు. అలాగని ఆమె చెడ్డదేమీ కాదు. అందుకే స్నేహం చెడగొట్టుకోలేకపోతున్నాను. ఎంతైనా ఇరుగు పొరుగు వాళ్ళం కదా? ఆవిడ మనసు బాధపడకుండా ఆమెలో మార్పు ఎలా తీసుకురావాలో తెలియజేయండి.

ఆమెలో మార్పు తీసుకురావటానికి మీరేమీ ప్రయత్నం చేయక్కరలేదు. బాధ మీది కాబట్టి మీరు మారండి. ముక్తసరిగా మాట్లాడటమనేది ఒక కళ. ఆసక్తిగా వినకుండా 'ఏదైన పని ఉంది' అని తప్పించు కోవచ్చు. స్నేహాన్ని ఎక్కడ ఉంచాలో అక్కడవరకూ ఉంచడానికి ప్రయత్నం చేయండి. ఆమె చెడ్డదేమీ కాదు అన్నారు. మనల్ని బాధపెట్టడానికి అవతలి వారు చెడ్డవారు కానవసరం లేదు. ఇద్దరు మంచి వ్యక్తులు కూడా 'మంచి' ఇరుగూపొరుగూ అవక పోవచ్చు.

స్నేహ, ఊరిపేరు లేదు:

మా పొరుగింటావిడ మొదట్లో చాలా బావుండేది. ఆమెకు నేను ఎన్నో సలహాలు ఇచ్చేదాన్ని. ప్రతీదానికీ నామీదే ఆధారపడటంతో తగ్గించేసాను. ఇప్పుడు ఆమె అటుపక్క ఇంటావిడతో దగ్గరగా ఉంటోంది. ఎంత కాదనుకున్నా బాధగా ఉంది. ఇదొక వైపు. మరో వైపు, నన్ను ఎవరు సలహా అడిగినా మంచి మనసుతో ఇస్తాను. అందుకనే నాకు పొరుగు హితులు ఎక్కువ. ఎలా వదిలించుకోవాలో అర్థం కావటం లేదు. నా సమస్య మీకు అసలు సరిగ్గా అర్థం అయ్యిందా? నాకే కావటం లేదు.

ఈ సమస్య మీ ఒక్కరిదే కాదు. చాలామందిది. "స్నేహితుల్ని ఎలా చేసుకోవాలి?" అని డేల్‌కార్నీ నుంచీ చాలా మంది వ్రాశారుగానీ 'ఎలా వదిలించు కోవాలి' అనే పుస్తకాలు తక్కువ వచ్చాయి. తెలుగులో అయితే అస్సలు రాలేదు. బాధలు వినటంలో ఆసక్తి తగ్గించుకోండి. మీరొక జ్ఞానమూర్తిగా ఊహించుకొని సలహాలివ్వటం మానెయ్యండి. 'నాకున్న అనుభవంతో ఇస్తే తప్పేమి ఉంది?' అని మీరు అడగవచ్చు, కానీ... అవతలి వారు అడిగితేనే సలహా లివ్వండి. ఇచ్చే ముందు ఒక ముఖ్యమైన విషయం గుర్తు పెట్టుకోండి. రూపాయి ఫీజు అంటే సగం మంది రారు. 'ఉచితం' అనేసరికి లక్షల మంది తమ బాధ చెప్పుకోవటానికి రెడీగా ఉంటారు. వీరు పదిమంది దగ్గర సలహా తీసుకుంటారు. చివరికి తమకి నచ్చిందే చేస్తారు.

హరిప్రసాద్, వరంగల్:

మరొకరికి సలహా ఇవ్వాలంటే జ్ఞానం ముఖ్యమా? అనుభవం ముఖ్యమా?

అనుభవం జ్ఞానం లో ఒక భాగం. ఆదిశంకరాచార్య వంటి ఏ కొందరికో తప్ప, అనుభవం (ఎక్స్‌పీరియెన్స్) వల్ల, పాండిత్యం (నాలెడ్జ్) వల్ల, పరిశీలన వల్ల జ్ఞానం వస్తుంది. అందువల్ల ఆ విషయంలో 'చదువు-వయసు' కూడా ముఖ్యమైన రోల్స్ ప్లే చేస్తాయి. వయసు ప్రభావం నిర్ణయాలపై ఎలా ఉంటుందో ఒక మంచి ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం.

ఒక కుర్రవాడు వంటింటి ఫ్రిజ్ లోంచి కేకు తస్కరిస్తూ ఫ్రిజ్ పైనున్న కప్పు బ్రద్దలకొట్టాడు. అతడి చెల్లెలు వంటింట్లో అమ్మకి సాయం చేస్తూ ఆరు కప్పులు క్రింద పడేసింది అనుకుందాం. ఎవరికెంత శిక్ష విధించాలి? 1. అయిదేళ్ళ కుర్రవాడు ఈ విషయంలో జడ్జ్‌మెంట్ ఇస్తే, జరిగిన నష్టం దృష్టిలో పెట్టుకుని అబ్బాయి కన్నా అమ్మాయికి ఆరు రెట్లు ఎక్కువ శిక్ష వేయాలంటాడు. 2. పన్నెండేళ్ళ వయసులో జడ్జి దృక్పథం మారుతుంది. 'అబ్బాయి నేరస్తుడు కాబట్టి శిక్షించాలి. అమ్మాయి నేరం లేదు కాబట్టి శిక్ష అవసరం లేదు'అంటాడు. 3. పాతికేళ్ళ వయసున్న వారు ఇదే కేసులో జడ్జిమెంటు ఇవ్వవలసి వస్తే, 'బ్రద్దలు కొట్టాలని ఎవరూ బద్దలు కొట్టరు కాబట్టి ఇద్దర్నీ శిక్షించవలసిన అవసరం లేదు ' అంటారు.దీన్ని పైగెట్ అండ్ కోల్‌బెర్గ్ థియరీ అంటారు

రాణి, చెన్నయ్:

నా పన్నెండేళ్ళ పెద్ద కూతురికి జ్వరం తగ్గితే అన్నవరం తీసుకెళ్ళి గుండు కొట్టిస్తానంటారు మా పెద్ద బావగారు. '...సొంత కూతురు కాకపోయినా మా ఆయనకి ఎంత ప్రేమో' అంటుంది మా ప్రేమమయి తోటి కోడలు. నా రెండో కూతుర్ని రెండో క్లాసు ఐ.ఐ.టి ఫౌండేషన్ స్కూల్లో చేర్పించమంటాడు మా ఉచిత సలహాల మరిది. ఇక మా సెల్ఫ్-స్టయిల్డ్ మేధావి మావయ్య గారి విషయానికి వస్తే, సాయంత్రం అవగానే తనతో పాటూ టీవిలో ప్రవచనాలు వింటూ, తాను అవాకులూ-చవాకుల రన్నింగ్ కామెంటరీతో చేసే జ్ఞాన విసర్జనని ఆస్వాదించమంటారు. తనతో పాటూ గుడి చుట్టూ 116 ప్రదక్షిణలు చేస్తే పదేళ్ళ తరువాతయినా సరే పండంటి కొడుకు పుడతాడని వత్తిడి చేస్తుంది మా అత్తయ్య. తనతోపాటు కలిసి మందు కొట్టటమే ఆధునిక అన్యోన్య దాంపత్యానికి దార్శనికత అంటాడు నా మొగుడు. తమ పనులు తాము చేసుకోకుండా, ప్రేమ పేరుతో తమ భావాల్ని ఇతరుల మీద రుద్దుతారెందుకో ఈ దగ్గర బంధువులు.

నీవు చెప్పేది లక్షలమంది 'ఆహా-ఓహో' అంటున్నారంటే, నీవేదో విశ్వ రహస్యాన్ని విప్పి చెపుతున్నట్టు కాదు. ఎవర్నీ ఆలోచింప చేయ(లే)ని ఒక ఊబిలోకి దింపుతున్నావన్న మాట. అనవసర జ్ఞాన విసర్జన (ఈ పదం మీరు వాడిందే. నాకు బాగా నచ్చింది) చేసే వారందరికీ ఇది వర్తిస్తుంది. ఒక రకంగా మేము చేసేది కూడా అదే కానీ, అడిగితేనే కదా మేము చెపుతున్నది.




స్వాభిప్రాయాలు 'చెప్పటం' వేరు. 'రుద్దటం' వేరు. ఆఫీసుల్లోనూ, ఇళ్ళలోనూ కొందరు తమకున్న అధికారాన్ని బట్టి ఇలాంటి నియంతృత్వాన్ని ప్రదర్శిస్తారు. చెప్పే హక్కు ఎవరికైనా ఉంటుంది. జాయింటు ఫ్యామిలీలలో మరీ ఉంటుంది. మనం బలహీనమైనప్పుడు, ఈ స్వయంకృత బిరుదాంకిత విజ్ఞులు, తమ అభిప్రాయాల్ని 'రుద్దటం' మొదలు పెడతారు. "నీ హేతువుకు సరిపోక

పోతే, ఏ ప్రవక్త చెప్పిందీ ఒప్పుకోకు. నాతో సహా..." అన్నాడు బుద్ధుడు. మన అభిప్రాయాల మీద, నమ్మకాల మీదా నిలబడాలంటే దానికి చాలా ధైర్యము, బలమైన వ్యక్తిత్వం, దాని కన్నా ముఖ్యంగా ఆర్థిక స్వాతంత్రమూ ఉండాలి. వంద మంది చెప్పే ప్రవచనాలు వింటే అయోమయం తప్ప ఏమీ మిగలదు. ఏ చెట్టు ఫలము రుచికరమో దానిని ఎన్నుకుంటారు సామాన్యులు. ఏది ఆరోగ్యకరమో దానిని ఆస్వాదిస్తారు విజ్ఞులు.

"ఒకే గురువు దగ్గర అభ్యసిస్తే నేను విజ్ఞుడవటానికి ఎంతకాలం పడుతుంది?" అని అడిగాడు శిష్యుడు.

"పది సంవత్సరాలు"

"పోనీ పది మంది గురువుల దగ్గర ఏకకాలంలో అభ్యసిస్తే?"

"వంద సంవత్సరాలు".


మానవ సంబంధాలు

అనామిక:

పెళ్ళి చూపుల్లో ఎవరి భావాలూ నాకు నచ్చటం లేదు. ఒకరైతే చాలా ఘాటుగా మాట్లాడారు. నేనేమి చెయ్యను?

'నాకు తగిన వ్యక్తి కనిపించలేదు' అన్నారు. నూరు శాతం తగిన వ్యక్తి అంటూ ఉండరు. వివాహం అంటేనే అడ్జస్ట్‌మెంట్. పెళ్ళి చూపుల్లో మీకు కాబోయే భర్తతో మాట్లాడినప్పుడు ఎవరి భావాలూ నచ్చలేదని వ్రాశారు. అంత కొద్ది సమయంలో అంత ఘాటుగా ఉండే భావాలేమిటి? మీరు దేని గురించి చర్చించుకున్నారు? మీ మనసుకు నచ్చేవారు వచ్చేవరకూ ఎదురు చూస్తే, వివాహం ఒక జీవిత కాలం లేటు అవుతుంది. మీ వయసెంతో చెప్పలేదు. మీకు ఇంకా వయసు మీరకపోతే మీ తల్లిదండ్రులని కొంత సమయం కావాలని అడగండి. ఆ గడువులోగా మీకు తగిన వాడ్ని ఎన్నుకోలేకపోతే వారు చెప్పిన వారినే చేసుకుంటానని చెప్పండి. వయసు పెరిగే కొద్దీ "బెగ్గర్స్ ఆర్ నాట్ ఛూసర్స్" అనే సూక్తి వర్తిస్తుంది. అప్పుడిక ఎన్నుకోవటానికంటూ ఎవరూ మిగలరు.

పేరులేదు, వరంగల్:



నా నాలుగేళ్ళ వయసులో నాన్న చనిపోయాడు. అమ్మ, అన్నయ్యా మేము ముగ్గురమే. మా అన్నయ్యా ప్రస్తుతం ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఒక రెబెల్ లాగా తయారయ్యాడు. ఇంట్లో రాక్షసుడిలాగా ప్రవర్తిస్తూ డబ్బుల కోసం అమ్మను కొడుతూ ఉంటాడు. నాన్న పోయిన కొత్తలో మా చిన్నప్పుడు చాలామంది మగవాళ్ళు ఇంటికి రావటం నాకు తెలుసు. నలభై యేళ్ళు పై పడిన తరువాత ఇప్పటికి కూడా అమ్మ అర్ధరాత్రిళ్ళు చాటింగ్ చేస్తూనే ఉంటుంది. దాన్ని అడ్వాంటేజ్ గా తీసుకొని అన్నయ్య అమ్మని బ్లాక్ మెయిల్ చేస్తుంటాడు. ఈ సమయంలో నాకో వ్యక్తితో పరిచయం అయింది. అతన్ని మనస్ఫూర్తిగా ప్రేమించాను. కొంతకాలం తర్వాత అతడు నన్ను వదిలేసి మరో వివాహం చేసుకున్నాడు. ఈ ప్రపంచమంతా నాకు దుర్మార్గంగా కనిపిస్తోంది. చుట్టూ ఉన్న మనుషులను చూస్తూ ఉంటే విరక్తి కలుగుతోంది, కసి పెరుగుతోంది, చనిపోవాలని కూడా అనిపిస్తోంది. ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు.

చిన్న వయసులో భర్త చనిపోయిన ఒక స్త్రీ, స్నేహం వెతుక్కుంది. వయసు పెరిగినా కూడా ఆ దాహం తీరలేదు, ఆమె మీ తల్లి. తల్లి పట్ల విముఖత పెంచుకున్న కొడుకు ఒక రెబెల్లా తయారయ్యాడు. ఆ శూన్యం నుంచి బయటపడటానికి మీరు ఒక వ్యక్తిని ఇష్టపడి, దానికి ప్రేమ అని పేరు పెట్టుకున్నారు. ఎవరి బలహీనతలు, అవసరాలు వాళ్ళవి.

నిజానికి అది ప్రేమ కాదు. ఉన్న పరిస్థితుల నుంచి బయటపడాలన్న మీ తాపత్రయం. అందువల్ల మీ సమస్యకి మీ తల్లి, మీ అన్నయ్యా, మరియు మీ జీవితంలో ప్రవేశించిన వ్యక్తి అనుకుంటున్నారే తప్ప 'మీరే' అని నమ్మడం లేదు. చుట్టూ ఉన్న పరిస్థితులు ఎటువంటివైనా జీవితంలో పైకి వచ్చి సుఖశాంతులతో బ్రతకడం మన కర్తవ్యం. మన సమస్యలకి ఇతరులని కారణభూతుల్ని చెయ్యటం మన బలహీనత. అయిపోయిందేదో అయిపోయింది. మీ చుట్టూ ఉన్న వాళ్ళని ద్వేషంతో కాక ప్రేమతో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. దానివల్ల సగం సమస్య అక్కడితో తీరిపోతుంది.

నది లోతు తెలుసుకోవటానికి రెండు కాళ్ళు పెట్టినవాడు మూర్ఖుడు. దాన్ని సాహసంగా అభివర్ణిస్తే అంతకన్నా దురదృష్టం మరొకటి ఉండదు. జీవితాన్ని కరెక్ట్ గా ప్లాన్ చేసుకొని మీ భవిష్యత్తును పునర్నిర్మాణం చేసుకోండి.

**(కొనసాగింపు వచ్చేనెల)**